క్లుప్తంగా

పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



నాగాయలంక: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవా కమిటీ ఆధ్వర్యంలో పేద వృద్ధులు, దివ్యాంగులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. దాత వర్రే యోగేశ్వరరావు, కుటుంబ సభ్యులు ఆర్థిక సౌజన్యంతో 50 మందికి దుప్పట్లు అందజేశారు. కాగా కార్తిక మాసం తొలిరోజు పురస్కరించుకుని దాత తలశిల సుబ్బారావు, శశికళ దంపతుల ఆర్థిక సహకారంతో వీరందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు. తొలుత ఆలయంలో స్వామివారికి అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజ, అలంకరణ కార్యక్రమాలు జరిగాయి. దాతల కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు పొన్నపల్లి చిన్నా, లంకమ్మ, మత్తి శేషుబాబు, బాబూరావు, తదితరులు సేవలందించారు.

మినుము సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి



కె.కొత్తపాలెం(మోపిదేవి): మినుము సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) డీడీఏ కె.జ్యోతి రమణి సూచించారు. మండలంలోని కె.కొత్తపాలెంలో డీఆర్‌సీ ఆధ్వర్యంలో రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా మినుము విత్తేముందు విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధికి ట్రైకోడెర్మావిరిడి 5 గ్రాములు ఒక కేజీ విత్తనానికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 2 ఎంఎల్ ఒకకేజీ విత్తనానికి కలుపుకుని విత్తన శుద్ధి చేయాలని తెలిపారు. డీఆర్‌సీ ఏడీఏ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వరిలో పొడ తెగులు రాకుండా హెక్సాకొనజోల్ 250 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఏవో బి.పద్మజ, వ్యవసాయాధికారి కె.హెప్సిబా రాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



పర్రచివర(నాగాయలంక): మండల పరిధిలోని పర్రచివర శివారు దుర్గాప్రసాద్‌పురంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మెండు నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని శనివారం అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించి సాయం అందించారు. అవసరమైనపుడు తమ వంతు సహకారం అందిస్తామని బాధిత కుటుంబానికి ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల పెదగొడపాలెంలో చిన్న వయస్సులోనే మరణించిన కార్యకర్త పరిశె శివరామకృష్ణ కుటుంబాన్ని రమేష్‌బాబు, నాయకులు పరామర్శించారు. అతని తండ్రిని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బుడిపల్లి బసవయ్య, బర్రంకుల సొసైటీ అధ్యక్షుడు తోట సాయిబాబు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది చిన్నారి, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్ తదితరులు రమేష్‌బాబు వెంట ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



పర్రచివర(నాగాయలంక): గ్రామ పంచాయతీ శివారు దుర్గాప్రసాద్‌పురంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి అవనిగడ్డకు చెందిన విక్కుర్తి వీర రాఘవయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.పది వేలు ప్రకటించారు. శనివారం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ట్రస్టు చైర్మన్, ప్రముఖ కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీనివాసరావు స్వయంగా ఈమొత్తాన్ని మెండు నాగమల్లేశ్వరరావుకు అందజేశారు. ఆయన సోదరుడు విక్కుర్తి రాంబాబు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెం వేమూరి గోపాలరావు నగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఉప్పులేటి సుదర్శన్‌కు గొర్రెపాటి విద్యాట్రస్టు అధినేత గొర్రెపాటి రంగనాథ బాబు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. సుదర్శన్ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోగా కట్టుబట్టలతో మిగిలారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న గొర్రెపాటి విద్యాట్రస్టు ప్రతినిధులు ఈ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఏదైనా జరిగితే బాధ్యులెవరు?

- తమ్ముళ్ల ఒత్తిళ్లతో నిబంధనలకు పాతర
- ప్రమాదం జరగలేదు కాబట్టి..అంతా హ్యాపీ!
- జరిగితే ఎవరు బాధ్యులు.. బలిపశువులు ఎవరు?
- దీపావళి టపాసుల విక్రయాల స్థలం యాజమానుల సంతకాలు ఫోర్జరీ?
- ఆర్డీవో వ్యతిరేకించినా.. తప్పని ఒత్తిళ్లు
- గత ప్రభుత్వమే మిన్న అంటున్న దుకాణదారులు.. అధికారులు



షాపుల పక్కనే పరదాలు కప్పిన గడ్డివాము (వలయంలో..) (ఫైల్)



షామియానాల కింద ఏర్పాటు చేసిన మందుగుండు సామగ్రి దుకాణాలు (ఫైల్)



దుకాణాల స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి, అధికారులు,పక్కన వలయంలో తమ్ముళ్లు (ఫైల్)

పెడన: మేమొచ్చాం.. మా మాటే వినాలి..లేకుంటే బాగోదు అన్నట్లుగా అటు మద్యం దుకాణాల్లో తలదూర్చిన స్థానిక తెలుగు తమ్ముళ్లు దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాట్లలోనూ తలదూర్చి ఏకంగా నిబంధనలకు పాతర వేశారు. అధికారులు, సిబ్బందిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకువచ్చి నిబంధనలకు విరుద్ధంగా దీపావళి టపాసుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారంటూ ప్రజానీకం దుమ్మెత్తిపోస్తోంది. ఎన్డీయే కూటమిలోని తమ్ముళ్లు ఈ విధంగా తయారయ్యారేమిటి బాబోయ్.. గత ప్రభుత్వమే మిన్న అన్న వ్యాఖ్యానాలు వారి సహచరుల వద్ద వ్యక్తపరిచినట్లుగా తెలుస్తోంది.

దరఖాస్తులు గడువులోపు సమర్పించకుండా సమర్పించేసినట్లుగా దుకాణాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలించడం, ఆ స్థలం ఎవరిది, ఎంత మందిది అనే విచారణ కూడా నిర్వహించకుండానే సమయం లేకపోవడంతో వంటి అనేక కారణాలను తమ్ముళ్లు సృష్టించారని విశ్వసనీయ సమాచారం. స్థలం యజమానుల నుంచి దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల మాకు ఎటువంటి అభ్యంతరం లేదని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలి. వీటిపై సంతకాలను ఫోర్జరీ చేసి ఇచ్చారనే ప్రచారం కూడా కొనసాగుతోంది.

స్థలంలో షామియానాలు.. గడ్డివాము

దీపావళి టపాసుల విక్రయాల ఏర్పాటు స్థలం ఎకరం లోపే. ఇది ప్రైవేటు స్థలం. ఆరుగురు యజమానులని తెలుస్తోంది. ఇందులో 20 దుకాణాలు. పక్కనే రెండు ఎకరాల గడ్డివాము ఉంది. ఆర్డీవో పరిశీలించి అభ్యంతరం చెప్పారు. ప్రతి ఏటా ఇలానే పెడతారని, అంతకు ముందు వారు అనుమతులిచ్చారని తమ్ముళ్లు చెప్పడంతో ఆర్డీవో ఒప్పుకోలేదు. గడ్డివాము తీయించి రేకుల షెడ్లు వేయాల్సిందేనని స్పష్టం చేశారు. తమ్ముళ్లు ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకురావడంతో ఉన్నతాధికారులు కొన్ని సూచనలు చేశారు. ఉన్నతాధికారులు చెప్పినవి ఏమీ చేయనేలేదు. ప్రమాదం జరగలేదు కాబట్టి అంతా హ్యాపీయే..జరిగితే ఎవరు బాధ్యులు, ఎవరు బలిపశువులు అయ్యేవారనే వాదనలు వినిపిస్తున్నాయి.

స్థలం లీజుకు ఇచ్చిన వారికి..

ఒక్కో దుకాణం నుంచి రూ.30 వేలు ఇవ్వాలని, ఆ తరువాత మరో రూ.5 వేలు ఇవ్వాలని తమ్ముళ్లు పట్టుపట్టడంతో దుకాణాదారులు వారు అడిగింది ఇచ్చేశారు. 20 దుకాణాలకు రూ.7 లక్షలు వసూలు కావాలి. ఇద్దరు తమ్ముళ్లు, ఒక విలేకరి (సాక్షి కాదు) దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో 17 దుకాణాల నుంచి మాత్రమే రూ.35 వేల చొప్పున రూ.5.90 లక్షలు వసూలు చేసినట్లుగా సమాచారం. చలనాలు, జీఎస్టీ, నిబంధనలను పాటించకుండా ఉన్నందుకు ఆయా శాఖలకు ఇవ్వకుండా ఇచ్చినట్లుగా చూపి, షామియానాలకు వెరసి మొత్తం రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారని సమాచారం. మిగిలిన సొమ్ము పంపకాలలో తమ్ముళ్లకు, విలేకరికి మధ్య గొడవలకు దారి తీయడంతో స్థలం లీజుకు ఒకరికి చెల్లించాల్సిన రూ.3 వేలు నగదుకు ఎసరు పెట్టినట్లుగా తెలుస్తోంది.

> **ఎవరు స్థల యజమానులో తేల్చే సమయం లేదు**
>
> దుకాణాల ఏర్పాటుకు స్థలం యజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలను ఇవ్వాలని చెప్పడంతో దుకాణాదారులు వాటిని తీసుకువచ్చి ఇచ్చారు. ఆస్థలం ఎంత మందిది అనే విషయంలో ముగ్గురికి చెందినది మాత్రమేనని చెప్పి ముగ్గురు ఇచ్చిన పత్రాలను ఇచ్చారు. వాటిపై సదరు యాజమానులే సంతకాలు చేశారా లేదా అనేది పరిశీలించే సమయం లేదు. పండుగ ముందు రోజు మధ్యాహ్నం లైసెన్సులు జారీ చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకున్నాం.
>
> – కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు, పెడన

శాంతిభద్రతల సమస్య సృష్టిస్తే రౌడీషీట్

డీఎస్పీ మురళీధర్



మాట్లాడుతున్న అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్

అవనిగడ్డ: మనోభావాలు దెబ్బతినేలా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టినా, ఫ్లెక్సీలు వేయించినా, లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగించినా వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతరులు, సమూహాలు, వర్గాల మనోభావాలు దెబ్బతినేలా ఫ్లెక్సీలు వేయిస్తే వాటిని తయారు చేయించిన వారిని, ముద్రించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు పంచాయతీ, విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఏదైనా వేడుకలు ఇతర సందర్భాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేవారు అవి పూర్తికాగానే స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. సమస్యలు కలుగజేసే ప్రాంతాల్లో ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని సంబంధిత శాఖలకు లేఖలు రాసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఎవరూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించొద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు యువకుమార్, ఈశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెడన కలంకారి క్లస్టర్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: పట్టణంలో కలంకారి పరిశ్రమ అంచెలంచెలుగా వృద్ధి చెందుతుందని, ఈ నేపథ్యంలో పెడన కలంకారి క్లస్టర్ ఏర్పాటు ఎంతో అవసరమని, దానిని ఏర్పాటు చేయడానికే కాకుండా అభివృద్ధికి కృషి చేస్తానని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం ఆయన గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణ మండపంలో ఆర్టిజన్ వేల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పెడన క్లస్టర్ అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ క్లస్టర్‌లో కలంకారి వస్త్రంపై సహజసిద్ధ రంగులతో ముద్రణలు చేయడం, ఉత్పత్తులు, మార్కెటింగ్ తదితర వాటిపై శిక్షణ తరగతులు కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు, మచిలీపట్నం జ్యూవెలరీ పార్కు అధ్యక్షుడు సుబ్బారావు, టీడీపీ నాయకుడు యక్కల శ్యామలరావు, భళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన అవసరం



ఘంటసాలలోని కేవీకేను సందర్శించిన కేఎల్‌యూ విద్యార్థులతో శాస్త్రవేత్తలు

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి

ఘంటసాల: కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు వ్యవసాయ విద్యా విధానంలో భాగంగా ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి కృషి విజ్ఞాన కేంద్రం విధుల వివరాలు, పనితీరు, కేంద్రంలో జరుగుతున్న వరి, మినుము విత్తన ఉత్పత్తి గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కేవీకేలో జరుగుతున్న పలు అంశాను వివరించారు. అనంతరం కేవీకేలోని డెమో యూనిట్స్ అయిన ఉద్యాన విభాగ షేడ్ నెట్‌లో మొక్కల పెంపకం, వివిధ వరి రకాలు, న్యూట్రి గార్డెన్, కోళ్లు, మేకలు, పశువులు, కొరమేను చేపల పెంపకం, ఇతర కార్యక్రమాలను వివరించారు. ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తలు రేవతి, మంజువాణి, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, యశ్వంత్, బోధన, బోధనేతర సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



రగ్బీపోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం నాగేశ్వరరావు తదితరులు

పెడన: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గూడూరులో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు పెడన తోటమూల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 17 విభాగంలో కృష్ణా జిల్లా జట్టు తరపున పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. బొడ్డు పండు, బొడ్డు చరణ్, దాసరి సాగర్, బైలపాటి జైరాజులతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు గండు నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ఆలయాల్లో వైభవంగా కార్తికమాసం పూజలు



అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలను వెలిగిస్తున్న మహిళలు

పెడన: కార్తికమాసం సందర్భంగా శివాలయాలను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయమే భక్తులు ఆయా శివాలయాలకు చేరుకుని మొదటి రోజు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించిన పిమ్మట స్వామివారిని దర్శనం చేసుకున్నారు. మరికొందరు భక్తులు స్వామివారికి అభిషేకాలను నిర్వహింపజేశారు. ఈ కార్తికమాసంలో కార్తిక సోమవారాలు, కార్తికపౌర్ణమి రోజులలో ఆయా ఆలయాలు వద్ద భక్తుల కోలాహలంతో శివనామస్మరణంతో హోరెత్తనున్నాయి. పట్టణంలోని శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ వారితో పాటు దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

నాగాయలంక: కార్తికమాసం మొదటిరోజు శనివారం నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలో భక్తులు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే పుణ్యస్నానాలు చేశారు. కృష్ణానదిలోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. వరదల కారణంగా నది లోతు పెరగడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో నదిలో లోతుకు వెళ్లకుండా ఒడ్డునే స్నానాలు చేస్తున్నారు. స్నానాల అనంతరం భక్తులు నదిఒడ్డున ప్రమిదల్లో కార్తికదీపాలు వెలిగించి సంప్రదాయక పూజతో వత్తులు వెలిగించారు. అనంతరం పలు ఆలయాలను దర్శించుకున్నారు. మహిళా భక్తులు దుస్తులు మార్చుకోవడానికి పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. గ్రామంలోని శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరి సమేత శ్రీనగరేశ్వస్వామి ఆలయంలో 30వ వార్షిక కార్తిక మాసోత్సవాల సందర్భంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో అర్చకులు కొల్లిపర సుబ్బారావు అభిషేకాలు, పూజాధికములు జరిపారు. మండలంలోని భావదేవరపల్లిలోని శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని కార్తిక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు.

మచిలీపట్నంటౌన్: పరమశివునికి అతి ప్రీతికరమైన కార్తికమాసం శనివారం నుంచి ప్రారంభమైంది. నగరంలోని పలు శైవ క్షేత్రాల్లో కార్తికమాస పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. భక్తులు తెల్లవారు జామునే స్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి పరమ శివునికి పూజలు చేశారు. కార్తిక మాసం తొలి రోజు అయిన శనివారం అన్ని శివాలయాల్లోనూ భక్తులు కార్తిక మాస పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు తొలి రోజు గణపతి స్వామి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 20వ తేదీన ఈ ఆలయంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు.

కోడూరు: కార్తికమాసాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాల్లో శనివారం ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. కోడూరులోని పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. లింగారెడ్డి పాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరుడికి అభిషేకాలను చేశారు. హంసలదీవి కాశీవిశ్వేశ్వర స్వామి, సాలెంపాలెం అగస్త్యేశ్వరస్వామి, మాచవరం రామేశ్వరస్వామి, వేణుగోపాలపురం అమర లింగేశ్వర స్వామి, విశ్వనాథపల్లిలో కాశీవిశ్వేశ్వరస్వామి, పిట్టల్లంక బాలనాగేశ్వర స్వామివారి ఆలయాల్లో కార్తికమాస పూజలను భక్తిప్రపత్తులతో జరిపారు. మహిళలు వేకువజామునే కాలువల వద్ద స్నానాలు ఆచరించి కార్తికమాస ఉపవాసాలను ప్రారంభించారు.

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు కనకదుర్గమ్మ అమ్మవారికి శనివారం గాజులతో అలంకారం చేశారు. గర్భాలయంలో ఉన్న అమ్మవారి మూలమూర్తికి వేలాది గాజులను మాలగా చేసి ధరింపజేశారు. ఆలయ ప్రాంగణాన్ని గాజుల తోరణాలతో అలంకరించిన తీరు ఆకట్టుకుంది. కోడూరుకు చెందిన విక్కుర్తి సుబ్బారావు - విష్ణుప్రియ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తికమాసాన్ని పురస్కరించుకొని రాత్రికి ఆకాశ దీపాన్ని వెలగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనార్థం తెలుగు ఉభయ రాష్ట్రాల నుంచి భక్తులు శనివారం తరలి వచ్చారు. కార్తిక మాసం ప్రారంభం కావడంతో తెల్లవారు జామునుంచే భక్తులతో క్యూలైనులన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గౌతమ్‌తో వైఎస్సార్ సీపీకి సంబంధం లేదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య

అవనిగడ్డ: అవనిగడ్డకు చెందిన బడే గౌతమ్‌తో వైఎస్సార్ సీపీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అతనికి పార్టీలో ఎలాంటి సభ్యత్వం లేదని ఈయన చేసే పనులకు, కార్యక్రమాలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్ని స్పష్టం చేశారు.

5న కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక: బొండాడ గ్రూప్ ఆర్థిక సౌజన్యంతో, స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5న 55 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్, బొండాడ గ్రూప్ ప్రతినిధి వంగర శేషగిరిరావు శనివారం విలేకరుల సమావేశంలో చెప్పారు. నాగాయలంకలోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మూడు గంట వరకు ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి (విజయవాడ) వైద్యనిపుణులు నేత్ర పరీక్షలు చేస్తారన్నారు. నవంబరు 29న బొండాడ గ్రూప్ అధినేత బొండాడ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో శుక్లాలు ఉండి కళ్లజోళ్లు అవసరమైన వారందరికీ ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం మొబైల్ నంబర్లు 94906 36466, 91823 45334లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

గూడూరు: హజ్రత్ గౌసె ఆజం దస్తగీర్ సంస్మరణ వేడుకలలో భాగంగా గూడూరులోని నాల్ సాహబ్ ఆస్థానాలో గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హజ్రత్ గౌసెఆజం జీవిత చరిత్ర పుస్తక పఠనం నిర్వహించారు. హాఫీజ్ మొహమ్మద్ షోయబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జెండా ఆవిష్కరణ నిర్వహించి తబర్రుక్ పంపిణీ చేశారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

కృత్తివెన్ను: మండల పరిధిలోని లక్ష్మీపురం- పోడు రహదారి మరమ్మతు పనులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రహదారుల మరమ్మతులకు సుమారు రూ.80 లక్షల వెచ్చించనున్నట్లు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు తులసీరావు, రత్తయ్య, నాగమల్లేశ్వరరావు, శ్రీరామకొండలరావు తదితరులు పాల్గొన్నారు.

20న కోటి దీపోత్సవం

ఏసీ సాంబశివరావు



రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు

మచిలీపట్నంటౌన్: శ్రీ పర్వతవర్ధిని, శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ ఎస్వీ సాంబశివరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం ప్రారంభమైన సందర్భంగా ఆయన దేవాలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయంలో చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఏసీ మాట్లాడుతూ కార్తిక మాసం సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జ్వాలతోరణం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 20న కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 24న వేలాది మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

కోడూరు: బెల్టు షాపు నిర్వాహకుడిని కోడూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మందపాకల గ్రామంలోని ఆర్సీఎం చర్చి సమీపంలో అదే గ్రామానికి చెందిన కడవకొల్లు శ్రీనివాసరావు బడ్డీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ బడ్డీ దుకాణంలో బెల్టు షాపును కూడా కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చాణిక్య సిబ్బందితో కలిసి శ్రీనివాసరావుకు సంబంధించిన బడ్డీ దుకాణంలో తనిఖీ చేశారు. ఎనిమిది మద్యం సీసాలను సీజ్ చేసి శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

నగరంలో తిష్టవేసిన సమస్యలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, ఇన్‌చార్జ్‌లు

కోనేరుసెంటర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మచిలీపట్నంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మండిపడ్డారు. గడిచిన ఆరు మాసాల్లో ఏ ఒక్క అభివృద్ధి పని జరగ లేదని దుయ్యబట్టారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కార్పొరేటర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఒకటో డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు డివిజన్‌లలో సమస్యలను పరిష్కరించేందుకు సమయం కేటాయించకుండా మేము గొప్ప అంటే మేమే గొప్ప అనే ప్రచారం కోసం మాత్రమే ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. 49వ డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన మూడు పండుగల్లోనూ ఎక్కడా పారిశుద్ధ్య చర్యలు చేపట్టలేదన్నారు. గత ప్రభుత్వంలో ఏ పండుగ వచ్చినా మా డివిజన్‌లలో పారిశుద్ధ్య పనులు చేయించి పండుగ ఉత్సాహాన్ని తీసుకువచ్చేవాళ్లమన్నారు. 11, 13వ డివిజన్ ఇన్‌చార్జులు గూడవల్లి నాగరాజు, గాజుల భగవాన్ మాట్లాడుతూ కుటుంబాలను ముంచేసే మద్యం పాలసీని మాత్రం అమలులోకి తెచ్చారన్నారు. నేతిబీరకాయలో నెయ్యి ఎంత ఉందో ఇసుకలో ఉచితం కూడా అంతే ఉందని ఎద్దేవా చేశారు. నగరంలో ప్రధాన రోడ్లపై వీధిలైట్లు వెలగని దుస్థితి దాపురించిందన్నారు. గత ప్రభుత్వంలో కార్పొరేటర్లుగా ఉన్న తామంతా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడు అక్కడికక్కడే పరిష్కరించే వచ్చే పరిస్థితి అన్నారు. అధికారులు కనీసం తాగునీటి విషయంలోనైనా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రామ్‌ప్రసాద్, 37వ డివిజన్ కార్పొరేటర్ ఐనం తాతారావు పాల్గొన్నారు.

వృత్తివిద్య తరగతుల పరిశీలన

పెడన: పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా తరగతులను శనివారం సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కె.రాములునాయక్ పరిశీలించారు. ఆయన ట్రైనర్‌కు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రధాన హై స్కూలు ప్లస్‌లలో 9 నుంచి 12వ తరగతి(ఇంటర్) వరకు అన్ని తరగతుల విద్యార్థులకు ప్రత్యేక టైం టేబుల్ ద్వారా వొకేషనల్ ట్రైనర్‌లను ఏర్పాటు చేసి వృత్తి విద్యను అందిస్తున్నామన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్, బ్యాంకింగ్ - సర్వీస్, మార్కెటింగ్ వంటి విద్యలలో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు రమేష్, ఉర్దూ ఏఎంవో సీతా మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు తీర్థావతి, వొకేషనల్ ట్రైనర్‌లు ఉన్నారు.

వంట సామగ్రి అందజేత

గూడూరు: మండలంలోని పోలవరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించింది. శనివారం బాధితులైన ప్రత్తిపాటి రాజారావు, యడవల్లి ఉమా మహేశ్వరరావు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, బట్టలు పంపిణీ చేశారు.